## క్లుప్తంగా

### నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

రొళ్ల: మండలంలోని బీజీ హళ్లి పంచాయతీ పరిధిలోని టీడీ పల్లి, మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

### జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



పెనుకొండ: ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

హిందూపురం/పెనుకొండ: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ హిందూపురం నియోజకవర్గ నాయకులు షబ్బీర్, గంగప్పలు డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని, పెన్షన్లు మంజూరు చేయాలని, నూతన అక్రిడిటేషన్ల జారీ చేయాలన్నారు. మరోవైపు పెనుకొండలోనూ ఆర్డీఓ ఆనందకుమార్‌కు జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. సమస్యలు పరిష్కరించాలని నాయకులు పోతులయ్య, నవీన్‌కుమార్, జాకీర్ హుస్సేన్, హరిప్రసాద్‌రెడ్డి, నరసింహమూర్తి, సోమశేఖర్, మధు తదితరులు డిమాండ్ చేశారు.

### కర్ణాటక పోలీసులకు సత్కారం



సీఐ గోవింద్‌ను సత్కరిస్తున్న ఉమర్ ఫరూక్

హిందూపురం: పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆటోడ్రైవర్ శివకుమార్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన కర్ణాటక పోలీసులను అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ జాతీయ అధ్యక్షుడు ఉమర్‌ఫరూక్ ఖాన్ ఘనంగా సన్మానించారు. వివరాలు.. కర్ణాటకలోని హోసకోటెలో ఉన్న తన తల్లి వద్దకు రెండు నెలల క్రితం హిందూపురంలోని రహమత్‌పుర ప్రాంతానికి చెందిన బాలిక వెళ్లింది. ఆ సమయంలో బాలికపై ఆటో డ్రైవర్ అఘాయిత్యానికి ప్రయత్నించారు. తప్పించుకున్న బాలిక నేరుగా హిందూపురంలోని తాత వద్దకు చేరుకుంది. గాయపడిన బాలిక సమాచారం మేరకు తాత ఫిర్యాదుతో హిందూపురం రెండో పట్టణ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి హోసకోటె పీఎస్‌కు బదలాయించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన హోసకోటె పీఎస్ సీఐ గోవింద్.. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఉమర్‌ఫరూక్ ఖాన్ సోమవారం హోసకోటెకు చేరుకుని సీఐ గోవిందుకు బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్-2025 జాతీయ పురస్కారం అందించి సత్కరించారు.

### జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

పెనుకొండ: పట్టణంలోని బ్రిలియన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో కరాటే పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ నాగమణి, కరాటే మాస్టర్ రామచంద్ర తెలిపారు. ఈ నెల 10న కర్ణాటక రాష్ట్రంలోని గౌరీబిదనూరులో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ఫర్హానం, అనితశ్రీ, అనిరుధ్, మోక్షఘ్న, ప్రవీణ్య, మల్లేష్‌నాయక్, కీర్తన పాల్గొంటారన్నారు.

### బొడ్రాయికి జలాభిషేకం



బొడ్రాయిని నీటితో అభిషేకిస్తున్న దృశ్యం

రొళ్ల: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ సోమవారం మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న బొడ్రాయికి 101 బిందెల నీటితో ప్రజలు అభిషేకించారు. వర్షాలు లేక భూములు బీడుగా వదిలేశామని, ప్రస్తుతం వర్షాలు కురిస్తే కనీసం జీవాల మేత కోసమైనా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి వీలుంటుందని స్థానికులు తెలిపారు.

### గుర్తింపు కార్డుల పంపిణీ

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులకు సోమవారం మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. గుర్తింపు కార్డులను తయారు చేయడానికి అవసరమైన నిధులను పూర్వపు విద్యార్థి బాలప్పగారి నరేష్ సమకూర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ తెలిపారు.

# శ్రావణ శోభ



అమ్మవారి ముఖచిత్రాలు



మార్కెట్‌లో విరివిగా సాగుతున్న వివిధరకాల పూల విక్రయాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరలక్ష్మీదేవి ప్రతిమలు

- పెరిగిన పండ్లు, పూలు, నిత్యావసరాల కొనుగోళ్లు
- పెళ్లిళ్లు, శుభకార్యాలతో కిటకిటలాడుతున్న బట్టలు, బంగారం దుకాణాలు

హిందూపురం: శ్రావణ మాసం సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. ఇళ్లలో కూడా వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్నారు. మంచి ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్లు, శుభకార్యాలు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పూలు, పండ్లు, నిత్యావసర సరుకులు తదితర వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

**18 వరకూ శుభ ముహూర్తాలు**

శ్రావణ మాసం ఇంటింటా శోభ తీసుకొచ్చింది. ముఖ్యంగా శుక్ర, శని, మంగళవారాలకు ప్రత్యేకత ఉంటోంది. ఈ ఏడాది శ్రావణంలో 5 శుక్రవారాలు, 5 శనివారాలు, 4 మంగళవారాలు వచ్చాయి. మొదటి శుక్రవారం మొదలు అన్ని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ నెల18 వరకూ సుముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. దీంతో ఇళ్లలో వ్రతాలను ఆచరించడం కోసం మహిళలు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేస్తున్నారు. అలాగే పెళ్లిళ్ల సీజన్ కూడా కావడంతో బట్టల దుకాణాలు, బంగారం షాపుల్లోనూ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.



పూజా సామగ్రి కొంటున్న మహిళలు



గాజుల అమ్మకాలు ఇలా..

**పూజా సామగ్రికి డిమాండ్**

శ్రావణమాసం సందర్భంగా ముఖ్యంగా మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు, నోములు చేస్తుంటారు. ఇందుకోసం పూజా సామగ్రి అవసరం కావడంతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. వరలక్ష్మీ వ్రతం సౌభాగ్యాన్ని ఇస్తుందని మహిళల నమ్మకం. దీన్ని ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యంగా అమ్మవారిని అలంకరించేందుకు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు.

**కొండెక్కిన పూలు**

వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. మహిళలు సామూహికంగా వ్రతాలు ఆచరిస్తుంటారు. ఇందుకోసం పూలు ఎక్కువగా అవసరమవుతాయి. అందుకే వివిధ రకాల పూలకు డిమాండ్ పెరిగింది. కేజీ చెండు పూలు రూ.300, విరజాజులు కేజీ రూ.800, చేమంతి పూలు కేజీ రూ.400, గులాబీలు (చిన్నవి) కేజీ రూ.150 పలుకుతున్నాయి. అలాగే కొబ్బరికాయ ఒక్కటి రూ.50, అరటి పళ్ల డజన్ రూ.80-110 వరకూ ధర పలుకుతున్నాయి. వీటితో పాటు వివిధ రకాల పండ్ల ధరలు చుక్కలంటుతున్నాయి.

**వ్యాపారాలు బాగా జరుగుతున్నాయి**



శ్రావణ మాసంలో పూజలు, వ్రతాలు ఎక్కువగా చేస్తుంటారు. ముఖ్యంగా వరలక్ష్మీదేవి పూజ కోసం అమ్మవారి బొమ్మలు, వివిధ రకాల పూజా సామాగ్రికి డిమాండ్ ఉంది. పూజ కోసం కొత్త విగ్రహాలు, ముఖముకుటం కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. శ్రావణ మాసం మొదలైనప్పటి నుంచి వ్యాపారాలు బాగా జరుగుతున్నాయి.

– చలపతి, వ్యాపారి, హిందూపురం

**అమ్మవారికి ప్రీతికర మాసం**



శ్రావణమాసం అమ్మవారికి ప్రీతికర మాసం. ముఖ్యంగా మహిళలు సకల శుభాల కోసం అమ్మవారికి కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహిస్తారు. అలాగే ఆలయాల్లో ప్రతి శుక్ర, శని, మంగళవారాల్లో వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ మాసం శుభకార్యాలు ఎంతో అనుకులమైనది.

– గోవిందశర్మ, అర్చకుడు, హిందూపురం

### కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

పెనుకొండ: దళితుల శ్మశాన వాటికను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి సోమవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌ను కోరారు. ఇందులో భాగంగానే వినతి పత్రం అందించారు. సోమందేపల్లిలో దళితుల శ్మశాన వాటికను కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు శ్రీనివాసులు, రవికుమార్, నారాయణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



నారాయణప్పను పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఛత్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దు నారాయణప్ప కాలు జారీ కిందపడ్డారు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సోమవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించండి

పరిగి: మండలంలో పనిచేస్తున్న విలేకరుల సౌకర్యార్థం ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని పరిగి ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దార్ హసీనా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. అలాగే వివిధ సమస్యల పరిష్కారానికై ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలోనూ వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా.. నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులను బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గిరీష్, ఉపాధ్యక్షుడు మూర్తి, ప్రధాన కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం



వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: జిల్లాలో పంటలు సాగు చేస్తున్న రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ విమర్శించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో కలిసి యూరియా కొరత లేకుండా చూడాలని , రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంటలకు సంబంధించిన ఎరువులు విత్తనాలతో పాటు అన్ని విధాల సౌకర్యాలు కల్పించామన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో కనీసం విత్తనాలు యూరియా అందించడం లేదన్నారు. గత ఏడాది అన్నదాన సుఖీభవ నగదు రైతులకు ఇవ్వలేదని, ప్రస్తుతం పీఎం కిసాన్ మాత్రమే రైతులు ఖాతాల్లో జమ అయిందన్నారు. సొసైటీల ద్వారా పంపిణీ చేయాల్సిన యూరియా పక్కదారి పట్టే పరిస్థితి నెలకొందన్నారు. తనిఖీలు నిర్వహించి యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మాగే చెరువులోని ఎస్సీ కాలనీలో దళితుల శ్మశాన వాటిక భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, సర్పంచులు సోము, కిష్టప్ప, వైస్ సర్పంచ్ వేణు, నాయకులు నరసింహ మూర్తి, కంబాలప్ప, లక్ష్మినరసప్ప, మంజు, ఆదినారాయణ రెడ్డి, ఈశ్వర్, నాగప్ప, జితేంద్ర రెడ్డి, నాగమణి, ఇమామ్ వలీ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యం

- కూటమి మోసాలను ప్రజలకు వివరించండి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మెళవాయిలో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈరలక్కప్ప, మధుమతిరెడ్డి తదితరులు

మడకశిరరూరల్: ఎన్నికల ముందు ఇష్టానుసారంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు అండ్ కో మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని ధ్వజమెత్తారు. సోమవారం మెళవాయి, కదిరేపల్లి పంచాయతీల్లో ఆ పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, సర్పంచులు నర్సేగౌడ్, రంగనాథ్, ఇన్‌చార్జ్‌ల అధ్యక్షతన ×బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ¤ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు చేసిన మోసాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రుణాంధ్రప్రదేశ్‌గా మార్చిందని విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడు పూర్తిగా హామీలను అమలు చేసిన చరిత్ర లేదన్నారు.

**కష్టపడిన వారికి గుర్తింపు**

కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఇప్పటికీ ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కూటమి నాయకుల అక్రమ కేసులు, దౌర్జన్యాలకు ఎవరు భయపడవద్దని అండగా ఉంటామన్నారు. రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కమిటీలను అందరూ కలిసి మెలసి సమష్టిగా అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించేలా పారదర్శకంగా పూర్తి చేయాలని కోరారు. మడకశిర నియోజకవర్గ గ్రామ, వార్డు కమిటీలు రాష్ట్ర స్థాయిలోనే మడకశిర పైలెట్ ప్రాజెక్టుగా నిలిచే విధంగా ఉండాలన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎంపీపీ కవిత, తాలుకా బీసీ సెల్ నాయకుడు ఆర్ అనంతపురం తిమ్మప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హనుమంతు, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గంగరత్నమ్మ, నరసింహమూర్తి, మండల ఉపాధ్యక్షుడు దశనాథ్‌రెడ్డి, న్యాయవాది నరసింహమూర్తి, సింగల్ విండో మాజీ డైరెక్టర్ రాజశేఖర్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మూర్తి, సర్పంచ్ కరియన్న, ఉప సర్పంచ్ రంగేగౌడ్, తాలుకా, మండల కమిటీల విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు కెంచప్ప, రవిశంకర్‌రెడ్డి, విజరాఘవరెడ్డి, మల్లికార్జున, శేషాద్రి, రంగనాథ్, దేవరాజు, నరసింహ, సికిందర్, వెంకటేష్, భగవంతప్ప, రమేష్, గోవిందరెడ్డి, సత్యనారాయణ, మంజునాథ్, నర్సేగౌడ్, హరిప్రసాద్, అశ్వత్థరెడ్డి, గోవిందప్ప, హరీష్, హనుమనాక్, తిప్పేస్వామి,నగేష్, కేశవరెడ్డి, నాగభూషణరెడ్డి, మంజునాథ్ రెడ్డి, సురేష్, హనుమంతరెడ్డి, ప్రవీణ్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### పావగడ పట్టుచీరకు రాష్ట్ర ప్రశస్తి



రెయిన్‌బో కళాంజలి పట్టు చీర



ఎంవీ ప్రకాశ్

పావగడ: తాలూకాలోని చేనేత పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన వైఎన్ హొసకోట గ్రామంలోని చేనేత కారుడు ఎంవీ ప్రకాశ్ మగ్గంలో నేసిన రెయిన్ బో కళాంజలి పట్టు చీరకు రాష్ట్రస్థాయి ప్రశస్తి లభించింది. ఈ నెల 7న బెంగుళూరులో జరిగే రాష్ట్రీయ చేనేత దినోత్సవంలో ఎంవీ ప్రకాశ్‌కు ప్రశస్తి అందించనున్నారు. రెయిన్ బో కళాంజలి పట్టు చీరను మగ్గంలో నేయడానికి రెండు నెలలు పట్టిందని ప్రకాశ్ తెలిపారు.

### గంగమ్మ విగ్రహ పునఃప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణ పరిధిలోని 21 వ వార్డు మోతుకుపల్లిలో వెలసిన గంగమ్మ తల్లి విగ్రహాన్ని సోమవారం పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకార్చనలు, హోమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ సువర్ణమ్మ, నాయకులు కురుబ లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, శబరీష్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి న్యాతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష

అమరాపురం: తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, తమ్మడేపల్లి సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తమ్మడేపల్లిలో తల్లి పాల వారోత్సవాలను అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఏవిధమైనా ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పించారు.

లేపాక్షి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఉదయం మండలంలోని బిసలమానేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

### మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి

రొద్దం: మాదక ద్రవ్యాల నిర్మూలన నేటితరం విద్యార్థుల చేతుల్లో ఉందని, అందుకు విద్యార్థులంతా కృషి చేయాలని ఎస్ఐ నరేంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలతో పాటు సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా తదితర అంశాలపై విద్యార్థుల అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలన్నారు.

### సెల్‌ఫోన్లు వెనక్కిచ్చేసిన అంగన్‌వాడీలు



హిందూపురం: సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాక్షిబృందం: పనిచేయని సెల్‌ఫోన్‌లతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. అధికారులు ఎన్నోసార్లు విన్నవించినా స్పందించలేదు. అందుకే పనిచేయని సెల్‌ఫోన్లు వెనక్కి ఇచ్చేస్తున్నామని అంగన్‌వాడీలు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుమేరకు సోమవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని సీడీపీఓ ఆఫీసుల వద్ద నిరసన తెలిపారు. అనంతరం సెల్‌ఫోన్లను సీడీపీఓలకు తిరిగి ఇచ్చేశారు.

### అన్నదాన సత్రంలో శాంతి హోమం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అన్నదాన సత్రంలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం శాంతి హోమాన్ని నిర్వహించారు. ఆగమికులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు అత్యంత వైభవంగా హోమాన్ని జరిపించారు. అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చిక్కబళాపురానికి చెందిన నారాయణప్ప సుమారు రూ. 10 లక్షలను డైనింగ్ హాల్‌కు తన సొంత నిధులు ఖర్చు చేశారు. ఈ సందర్భంగా ఈయన్ను సన్మానించారు. సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 8 మందికి స్వల్ప గాయాలు

పెనుకొండ: మండలంలోని హరిపురం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన 8 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఎమ్మిగనూరుకు చెందిన ఇంద్రజ, సుధాకర్, రాఘవేంద్ర, వేమేష్, మంజుల, శశికళ తదితరులు అరుణాచలం వెళ్లి ఎమ్మిగనూరుకు తిరిగి వెళ్తుండగా హరిపురం వద్ద సిమెంట్ లారీ ఢీకొనడంతో స్వల్పంగా గాయపడినట్లు ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.





ఉత్సవ విగ్రహాల చుట్టూ జీవాలను ప్రదక్షిణ చేయిస్తున్న కాపర్లు

### జీవాలను కాపాడు స్వామీ..

రొళ్ల: పెంపుడు జీవాలు రోగాలు బారిన పడకుండా కాపాడు స్వామీ అంటూ గొర్రెల కాపర్లు రంగనాథస్వామి, జుంజప్పస్వామిని వేడుకున్నారు. సోమవారం మండల పరిధిలోని కె.గొల్లహట్టిలో వెలసిన స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వద్దకు తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు. ప్రత్యేక పూజల తర్వాత కాపర్లు ఉత్సవ విగ్రహాల చుట్టూ జీవాలను ప్రదక్షణ చేయించారు.

### జీఓలను రద్దు చేయాలి



ప్రభుత్వ సర్క్యులర్లను దహనం చేస్తున్న నాయకులు

మడకశిర: విద్యావ్యవస్థలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, విద్యారంగలో సమస్యలు బయటికి రాకుండా ఉంచడానికే కూటమి ప్రభుత్వం తప్పుడు జీవోలు జారీ చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ ఆరోపించారు. పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులకు అనుమతి లేదని జీఓలు జారీ చేయడం హేయమన్నారు. జీఓలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో ప్రభుత్వ సర్క్యులర్ కాపీలను దగ్ధం చేశారు. వెంటనే జారీ చేసి ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముతహీర్, షాహిద్, సాయి, తిమ్మరాజు, దేవ తదితరులు పాల్గొన్నారు.